

నూతన మెడికల్ సర్టిఫికెట్లు పొందాలి

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉపాధ్యాయులు బదిలీ నియంత్రణ చట్టం - 2005 ప్రకారం మెడికల్ సర్టిఫికేట్ ద్వారా ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ పొందుటకు అర్హత ఉన్న పూర్వపు తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ కాకినాడ, విశాఖపట్నం కెజిహెచ్‌లో ఈనెల 24 నుండి 26 వరకు అనారోగ్య సంబందిత సర్టిఫికేట్ లను చూపించి నూతన మెడికల్ సర్టిఫికేట్ పొందవలెనని జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయల మెడికల్ చెకప్ చేయుంచుకొని సంబందిత డాక్టర్ నుండి మెడికల్ సర్టిఫికేట్ తీసుకున్నది మాత్రమే ప్రిఫరెన్సీయల్ కేటగిరిలో సమర్పించవలెనని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు సూచించారు.

మన్యంలో ఈదురుగాలుల బీభత్సం

- కుండపోతగా భారీ వర్షం
- నేల కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-పాడేరు:- పాడేరులో శుక్రవారం మిట్ట మధ్యాహ్నం ఈదురు గాలులతో కుండపోతగా వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్ష బీభత్సానికి పాడేరు పట్టణం చిగురుటాకుల అల్లాడిపోయింది. ఈదురు గాలుల మూలంగా పట్టణ పరిధిలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, లైన్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఐదు 33 కెవి విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. మెడికల్ కళాశాల అటవీ శాఖ క్వార్టర్స్ పీవో బంగ్లా సమీపంలో మెయిన్ రోడ్డు పై విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి.: ప్రధాన రహదారిలో తలారి సింగి వద్ద భారీ వృక్షం నేల కొరిగింది. దీంతో ట్రాఫిక్ దిగ్బంధం ఏర్పడింది. వారపు సంత జరిగే మెయిన్ రోడ్డు ప్రాంగణంలో కూడా చెట్టుతో పాటు విద్యుత్ స్తంభం విద్యుత్ తీగలు నేల కొరిగాయి. దీంతో, ఈ రోడ్లో కూడా ట్రాఫిక్ అంతరాయం కలిగింది. భారీ వర్షానికి పాత పాడేరు గ్రామంలోని కొన్ని నివాస గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో కుటుంబాల వారు అవస్థలు పడ్డారు. మండలంలోని డి కొందూరు గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోయి ట్రాఫిక్ స్తంభించింది. భారీగా వర్షం నీరు ప్రవహించింది. సుమారు రెండు గంటలసేపు ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి పాడేరు పట్టణం కకా వికలమై పోయింది.



నుజ్జయిన బైక్



రోడ్డుపై కూలిన భారీ వృక్షం

వారపు సంతలో గిరిజనుల అవస్థలు

పాడేరు: పాడేరు మండల కేంద్రంలో శుక్రవారం జరిగే వారపు సంతకు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన గిరిజనులు భారీ వర్షం ఈదురుగాలుల బీభత్సంతో తీవ్ర అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం సంత జోరుగా సాగుతున్న సమయంలో ఈదురు గాలులు భారీ వర్షం సంతను కమ్మేసింది, ఈ హఠాత్పరిణామంతో సంతలోనుంచి జనం తలో దిక్కుగా పరుగులు తీశారు. భయాందోళనలకు గురయ్యారు. నీడ దొరికిన చోట తల దాచుకున్నారు. సరిగ్గా సంత జరిగే ప్రాంగణంలోని ఒక భారీ వృక్షం విద్యుత్ స్తంభం తీగలు నేలకొరిగాయి. కొన్ని క్షణాల వ్యవధిలోనే ఇంత బీభత్సం జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలు ఆటోలో తరలివచ్చిన గిరిజన రైతులు రహదారికి చెట్లు అడ్డంగా కూలి పోవడంతో గ్రామాలకు వెళ్లడానికి అవస్థలు పడ్డారు.



సంత వద్ద కూలిన విద్యుత్ స్తంభం

నిలిచిన విద్యుత్ సరఫరా

పాడేరు: పాడేరు పట్టణంలో శుక్రవారం రాత్రి అంధకారం అలుముకుంది. ఈదురు గాలిలో వర్షం వల్ల పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వైర్లు చెట్లు కూలి పోవడంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు శాఖ అధికారులు పట్టణంలో విద్యుత్ పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టినప్పటికీ రాత్రి తొమ్మిది గంటల వరకు కూడా విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. రేపటి వరకు విద్యుత్ పునరుద్ధరణ జరిగే అవకాశంలేనట్లు ఆ శాఖ అధికారులు సూచనప్రాయంగా తెలిపారు.

అరకులోయరూరల్: అరకులోయ పరిసర ప్రాంతాలలో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు భారీ వర్షం కురిసింది.ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి మధ్యాహ్నం 12 .30 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4గంటలు వరకు భారీ వాన కురిసింది. దీంతో, రోడ్లన్ని జలమయయ్యాయి. అరకు వారపు సంత కావడంతో మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు, వ్యాపారస్తులు వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జగత్ రాయ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణానికి కృషి చేస్తున్న ఆ కళాశాల గ్రంథాలయ అధ్యాపకులు తాంగుల జగత్ రాయ్‌ను పాడేరు సబ్ కలెక్టర్, ఇన్చార్జి ప్రాజెక్ట్ అధికారి సౌర్యమన్ పటేల్ అభినందించారు. డిగ్రీ కళాశాల 17వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయభారతితో కలిసి జ్యోతి ప్రజ్వల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల మైదానం సమీపంలోనే పొడి చెత్త, తడి చెత్త డంపింగ్ యార్డ్ ఉండటంతో విద్యార్థుల ఆరోగ్యాలకు హానికారంగా ఉంటుందని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడం అభినందనీయమన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా కోటి 50 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే డిగ్రీ కళాశాల మైదానం చుట్టుపక్కల ప్రహరీ నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మినిమల శ్రీనివాస్ పాత్రుడు, కళాశాల అధ్యాపకులు రమణ, లీలా పావని, కెజియ, సంతోషి, రవీంద్ర నాయక్, జగదీష్ బాబు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న అధికారులు, అధ్యాపకులు



చింతపల్లి ఎఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆర్‌వి.నగర్-పాలగెడ్డ రహదారి పనులు చేపట్టాలి

- 20న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం ఆర్‌వి.నగర్ నుంచి పాలగడ్డ వరకు రహదారి నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కోరుతున్నాయి. ఈ సమస్యపై ఈ నెల 20న ఆదివారం గంగవరం జంక్షన్ నుంచి ధారకొండ హైస్కూల్ వరకు ర్యాలీ చేపట్టడానికి అనుమతి ఇవ్వాలని చింతపల్లి ఏఎస్పి నవజ్యోతి మిశ్రాకు సిపిఎం గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్, జనసేన మండల ఉపాధ్యక్షులు బత్తుల సిద్ధార్థ మార్కరాజు తదితరులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనికి ఎఎస్‌పి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి రహదారి నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తానని ఎఎస్‌పి హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా శాంతియుతంగా ర్యాలీ చేపట్టాలని ఆయన సూచించినట్లు పేర్కొన్నారు.

అనంతరం నాయకులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు రహదారి పెద్ద పెద్ద గోతులు పడి అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఆంధ్ర, ఒరిస్సా, తెలంగాణ, చతీష్ఘడ్ రాష్ట్రాల నుంచి నిత్యం ధారాలమ్మ అమ్మవారి రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. అంతరాష్ట్ర రహదారి అయిన దీని పట్ల కొన్ని సంవత్సరాలుగా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడం దారుణమన్నారు. సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు విద్య, వైద్యం, ఇతర అవసరాల నిమిత్తం మైదాన ప్రాంతానికి వెళ్లాలంటే నరక యాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు గత 15 సంవత్సరాలుగా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెబుతూనే రకరకాల కారణాలు చెప్పి నిర్మాణ పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. 2024 సెప్టెంబర్ 8న కురిసిన భారీ వర్షాలకు వరదలకు ఆర్‌వి.నగర్ నుండి సీలేరు వరకు రహదారి కొట్టుకుపోగా సీలేరు నుంచి పాలగడ్డ వరకు పెద్ద పెద్ద గోతులుగా తయారై రహదారి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఈ ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబురావు, గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు బాకూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జమాల్‌ఖాన్, మల్లికార్జునరావు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురం కళాశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్టు చైర్మన్ ఎండి.జమాల్‌ఖాన్, టిడిపి నాయకులు జంగాల మల్లికార్జునరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం వంటి ప్రమాదకరమైన వాటికి బానిసలే కాకుండా దేశానికి వెన్నెముకగా యువత శక్తివంతంగా కావాలని సూచించారు. అనంతరం చింతూరు మండలం ఎర్రంపేట, వి.ఆర్.పురం మండలం జీడిపప్పు పంచాయతీ పరిధి మొలకపల్లి గ్రామాల జట్లు మధ్య టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. టాస్ గెలిచిన ఎర్రంపేట బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రథమ బహుమతికి జంగాల మల్లికార్జునరావు రూ.30 వేలు, ద్వితీయ ప్రైజ్ మనీకి ఎండి జమాల్ ఖాన్ రూ.20వేలు, బెస్ట్ విన్నర్స్, రన్నర్స్‌కు రూ.30వేలు విలువైన మెమోంటోలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పరాజ్, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, తెలుగు యువత నాయకులు బోర్ర నరసింహారావు, శంకర్రావు, టోర్నమెంట్ కమిటీ సభ్యులు వేముల అజయ్, శ్రావణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్ జారీపై హర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఎస్సీ వర్గీకరణ అమలుకు రాజ పత్రాన్ని విడుదల చేయడంపై ఎమ్మార్పీఎస్ అల్లూరి జిల్లా అధ్యక్షులు మోర్త బుజ్జిబాబు ఆధ్వర్యాన శుక్రవారం రాజవొమ్మంగిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ప్లకార్డులను ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఎమ్మార్పీఎస్ దండోరా ఉద్యమాన్ని స్థాపించి 30 సంవత్సరాల పాటు అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఏజెన్సీలో మాదిగల పక్షాన నిలబడిన ఎమ్మెల్యే మిర్యాల శిరీషదేవి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు గుండెపల్లి జీవరత్నం, బోడపాటి కామరాజు, కాకాడ రాజేశ్వరి, మోర్తా అరుణ, గోరంట్ల విజయ, అయినవిల్లి ఏసురత్నం, ఖండేలి నరసమ్మ, బొండాడ ప్రేమకుమారి, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో కేక్ కట్ చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు



చర్చిలో సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ దేవరాజు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే జరుపుకున్నారు. మండలాల్లోని అనేక గ్రామాల్లో యేసు మానవాళి పాపాలను కడగడానికి తన ప్రాణాన్ని త్యాగం చేసి శిలువ వేయబడిన రోజు శుభ శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కేంద్రం పాడేరులోని చర్చిల్లో పాస్టర్లు సిహెచ్.దైవకప, జి.తిమోతి, పి.జాన్ ఫ్రెడ్రిక్, ఎం.బాబురావు, బుచ్చయ్య, వైవై రత్నం, ప్రేమ్ కుమార్, ఎం.డానియల్, జాషువా, వి.మత్స్యరాజు, వి. దేవరాజు, యోబు, ఎస్.అబ్రాహాము, పి.డేవిడ్, లూకా, ఇశ్రాయేలురాజు, పాల్ డేవిడ్, ఎజ్రా, తదితరులు సిలువపై యేసు పలికిన ఏడు మాటలను వివరించారు. క్రీస్తు మరణాన్ని వివరిస్తూ యుసివైఎ సభ్యులు ఎం.స్టీవెన్ శ్రీనివాస్, డి.రవికుమార్, కె.సత్యారావు, ఎస్.సంజీవ్, పి.గ్లోరియస్, రాకేష్, తదితరులు ప్రత్యేక గీతాలు ఆలపించారు.

హుకుంపేట: స్థానిక చర్చిలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక పాస్టర్ కొర్రా. ఆనంద్ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ప్రార్థన నిర్వహించారు. . మానవాళి సంక్షేమం, ప్రేమ, కరుణ, క్షమాపణ వంటి సద్గుణాన్ని ఏసు బోధించారన్నారు.

అరకులోయలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు.

అరకులోయ రూరల్: అరకులోయలోని పరిశుద్ధ మేరీ లూథరన్ దేవాలయంలో భక్తిశ్రద్ధలతో పవిత్ర శుక్రవారం ప్రార్థనలు జరిగాయి. శిలువపై ఏసు చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. యేసుక్రీస్తు ప్రేమ కలిగి ఉండాలని రెవరెండ్ బిఇ సంజీవ్ కుమార్ తెలియజేచేశారు.ఈ ప్రార్థనలో సంఘ పెద్దలు లెనిన్ రాజు, శాంతి భూషణ్ రాజ్, డోంబుర్ ధర్, ప్రధాని అషేరు, కిల్లో రాజు,మేరీ మణి,ప్రతాప్, రాజా ప్రసన్న, అలోక్ కుమార్,ఆర్య వర్ధన్,సునీత రాజేష్ పాల్గొన్నారు.



బైబిల్‌ను చూపుతున్న క్రైస్తవులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి సంతోష్‌కుమార్




విఆర్.పురం మసీదు వద్ద ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేత సంతోష్, ముస్లిం పెద్దలు

ప్రజాశక్తి-విఆర్.పురం

కేంద్ర బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాలని తక్షణమే రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై ప్రజాశక్తి శుక్రవారం ముద్రించిన ప్రత్యేక సంచికను విఆర్ పురం మండల కేంద్రంలోని మసీదు వద్ద ముస్లిములకు సిపిఎం నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగంపైనా, మైనారిటీ హక్కులపైనా దాడి చేస్తుందని, దేశ లౌకిక పునాదులను దెబ్బతీస్తుందని విమర్శించారు. ప్రజల మధ్య మతపరమైన చీలికలను పెంచుతుందన్నారు. మోడీ ప్రభుత్వ ఈ మతోన్మాద రాజకీయ విధానాలపై సిపిఎం నికరంగా పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, శీరపు తాతబాబు, ముస్లిములు సర్పరాజ్, అనిపు, జావిద్, షరీఫ్, రహీం పాల్గొన్నారు.

కూనవరం : వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని సిపిఎం కూనవరం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రజాశక్తి ప్రచురించిన వక్ఫ్ చట్ట ప్రత్యేక సంచికను కూనవరం మసీదు వద్ద ముస్లిములకు శుక్రవారం సిపిఎం నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు, సుఫీ, యూసుఫ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



కూనవరం మసీదు వద్ద ...

సిపిఎం సీనియర్ నాయకుడు కారం రాజులు మృతి

జిల్లా, మండల నేతలు ఘన నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం

సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ కారం రాజులు మండలంలోని గుర్రంపేట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, నాయుకలు శుక్రవారం రాజులు మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోయం చిన్నబాబు మాట్లాడుతూ రాజులు ఊహ తెలిసినప్పటి నుండి సిపిఎంను నమ్ముకొని పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పని చేశారని తెలిపారు. రాజులు మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కమిటీ సభ్యులు పొడియం శ్రీరామ్మూర్తి, కారం సుందరయ్య, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్థివదేహంపై జెండా కప్పుతున్న చిన్నబాబు

ఘనంగా ముత్యాలమ్మ జాతర రాట ప్రతిష్ట



రాటను ప్రతిష్టిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-చింతపల్లి:చింతపల్లిలో ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దురియ హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావు, పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ముహూర్తపు రాట ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాతర ఉత్సవం ఈ నెల 24 నుంచి 27 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రకటించింది. విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీగా సన్నాహాలు చేపట్టింది. ఆర్గనైజింగ్ సెక్రటరీ బేతాళుడు, చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషా దేవిలు సమన్వయంతో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తుల సమక్షంలో ప్రతిష్ఠించారు.

చేపల వేట నిషేధ పరిహారానికి సర్వే

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులకు వేట నిషేధ కాలానికి సంబంధించి పరిహారం చెల్లించేందుకుగాను ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామాల్లో సర్వే చేపట్టారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో శుక్రవారం సచివాలయ ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్మిరెడ్డి త్రినాధ్, నాగమణి, కూటమి నాయకులు, మత్స్యకార నాయకులతో కలిసి సర్వే చేపట్టారు. సముద్ర తీరంలో పర్యటించి సీసీ బోట్లు, ఎంసీ బోట్లు, లైసెన్స్ లను పరిశీలించి నమోదు చేశారు. వేట నిషేధ కాలానికి సంబంధించి పరిహారం చెల్లించేందుకు అర్హులైన మత్స్యకారుల జాబితాను రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ వేట నిషేధ కాలానికి సంబంధించి 20 వేల పరిహారం ఈ నెల 26 తేదిన మత్స్యకారుల బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, అర్హులందరికీ పరిహారం అందే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, సొసైటీ ప్రెసిడెంట్ పిక్కి కోదండరావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, కూటమి నాయకులు వాసుపల్లి శివ, వాసుపల్లి రాము, మైలపల్లి ప్రసాద్, సత్యారావు, చోడిపల్లి రాంబాబు, బొంది గుర్రన్న, పిక్కి చిన్నారి, పిక్కి కిరణ్, గోసల అంజి, పిక్కి కోటి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మధురవాడ : ప్రతి ఉద్యోగి కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను తప్పనిసరిగా పూర్తిచేయాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవి అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులందరికీ ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికీ విధి నిర్వహణలో నైపుణ్యాన్ని పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటుచేసి, ఆన్‌లైన్‌లో శిక్షణనిస్తోందని, అన్ని రంగాల ప్రభుత్వ ఉద్యోగులు దీన్ని వినియోగించుకొని సంబంధిత కోర్సుల ద్వారా పూర్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ పోర్టల్‌లో ప్రభుత్వ ఉద్యోగులందరి వివరాలు ఆయా డిపార్ట్‌మెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేశామని, ప్రతి ఉద్యోగి తమ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్, ఒటిపి ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. కర్మయోగి పేరున ఆన్‌లైన్ కోర్సులో చేరే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు వివరించారు. తమ మొబైల్ ఫోన్లలో పోర్టల్‌లో లాగిన్ చేయించి, మొదటి కోర్సు 'కోడ్ ఆఫ్ కాండక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్' ను ప్రారంభించారు.

కాఫీ పరిశ్రమను ఏర్పాటు చేయాలి

- నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్



మాట్లాడుతున్న పొద్దు బాలదేవ్.

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రాఖ్యాతిగాంచిన ఆర్గానిక్ కాఫీ ఉత్పత్తి పరిశ్రమను పాడేరు ఐటిడిఏ పరిధిలో ఏర్పాటు చేసి ఆదివాసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో శుక్రవారం విలేకరులతో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల అధ్యక్షులు జి చిన్నబాబు, మండల ఉపాధ్యక్షులు కిల్లో జగన్నాథం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేయడమేనని దీని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అల్లూరి జిల్లా ,పాడేరు ఐటిడిఏ 11 మండలాల పరిధిలో ఆర్గానిక్ కాఫీను సుమారు లక్షల 30 వేల మంది రైతులు 2 లక్షల ఎకరాల్లో,15 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండిస్తున్నారని తెలిపారు. ఆదివాసి ప్రాంతంలో కాఫీ పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా మైదాన ప్రాంతంలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఎవరు ప్రయోజనం కోసమని విమర్శించారు. ఆదివాసి ప్రాంతంలో ఐటీడీఏ ద్వారా కాఫీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆదివాసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్గానిక్ కాఫీ పండిస్తున్న రైతులకు సుమారు 60 కోట్ల బకాయి ఉన్నాయని, తక్షణమే చెల్లించాలన్నారు. కాఫీ తోటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, తోటలో ప్రమాదాన్ని గురవుతున్న రైతులకు భీమా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కిల్లో దొబులు పాల్గొన్నారు.

పేదింట పెద్ద కష్టం!

- జీవచ్ఛవంలా మారిన ఎదిగొచ్చిన కొడుకు
- ప్రమాదంలో గాయపడి నాలుగేళ్లుగా మంచానికే పరిమితం
- ప్రభుత్వం, దాతల సాయానికి ఎదురుచూపు



వీల్‌చైర్‌కే పరిమితమైన మోహనకృష్ణ

ప్రజాశక్తి -ఆనందపురం : నాలుగేళ్ల క్రితం వరకు అందరిలాగానే ఆడుతూ, పాడుతూ తిరుగుతూ, ఇంటర్ వరకు చదువుకున్న ఆ యువకుడు అనుకోని ప్రమాదంలో నడుము, కాళ్లు చచ్చుబడిపోయి జీవచ్ఛవంలా మారి మంచానికే పరిమితమయ్యాడు. రెక్కాడితేగాని డొక్క నిండని నిరుపేద కుటుంబంలోని ఏకైక కుమారుడు అందొచ్చి, ఆదుకుంటాడని భావిస్తే, ఇలా ఆవిటివాడు కావడంతో ఆ తల్లి వేదన అంతాఇంతా కాదు. ప్రభుత్వం, దాతలెవరైనా ఆదుకుని తనకు ఆసరాగా నిలవాలని బాధిత యువకుడు వేడుకుంటున్నాడు. వివరాలివి. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన కుర్ర నాగేశ్వరరావు, నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇంటిపెద్దదిక్కు కష్టంపైనే కుటుంబపోషణ సాగుతున్న పరిస్థితుల్లో పదేళ్ల క్రితం నాగేశ్వరరావు అకాలమరణంలో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. స్థానికంగా కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్న నాగలక్ష్మి, తర్వాత మండలంలోని నేలతేరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో కుక్‌గా చేరింది. వచ్చిన కాస్తో, కూస్తో సంపాదనతో అష్ట కష్టాలు పడి కుమార్తెలు శాంతికుమారి, గీతాలక్ష్మిల పెళ్లిచేసింది. కొడుకు మోహన్‌కృష్ణ (23) ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, 2021 మే నెలలో స్నేహితులతో సరదాగా తాటి చెట్టు ఎక్కి, చెట్టు పైనుంచి కిందన పడడంతో నడుము రెండు కాళ్లు, చచ్చుబడిపోయాయి. అప్పటివరకు కష్టాల్లోనైనా సాఫీగా సాగుతున్న ఆ కుటుంబం ఒక్కసారిగా భారీ కుదుపునకు గురైంది.

అందొచ్చిన కొడుకు మంచానపడడంతో అందినచోట అప్పులు చేసి చికిత్స చేసింది. రోజుకు రూ.800 చొప్పున వెచ్చించి ఫిజియోథెరపీ కూడా చేసినా, మోహనకృష్ణ ఆరోగ్యం బాగుపడకపోగా, వీల్‌చైర్‌కు పరిమితమైపోయాడు.

ఆటపాటల్లో ఎంతో చలాకీగా ఉండే మోహన్‌కృష్ణ చదువుకునేరోజుల్లో ఉన్న ఆసక్తితో కంప్యూటర్ డిజైనింగ్ నేర్చుకున్నాడు. తాను మంచం పట్టిన తర్వాత ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందలేదని మోహనకృష్ణ వాపోతున్నాడు. అధికారులు స్పందించి తనకు పింఛను మంజూరు చేయాలని కోరుతున్నాడు. తాను డిజైనింగ్ నేర్చుకున్న నేపథ్యంలో ప్రభుత్వం, ఏదైనా ప్రైవేటు సంస్థలు తనకు వర్క్ ఫ్రం హోం ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతున్నాడు. 9948876619 నంబర్‌కు సంప్రదించి, తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విఆర్ఎ దుర్మరణం



బైక్ పక్కన విఆర్ఎ మృతదేహం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ పరిధి వెంకయ్యపాలెం గ్రామ సమీపం అరకు హైవే రోడ్డు వద్ద బొలెరో స్కూటీ ఢీ కొట్టిన ఘటనలో వీఆర్ఏ మృతి చెందాడు శుక్రవారం అరకు నుండి విశాఖకు వెలుతున్న బొలెరో ఎస్ కోట నుండి కాశీపట్నం కు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టింది. స్కూటీపై ప్రయణిస్తున్న ఎన్ ఆర్ పురం పంచాయతీ వీఆర్ఏ మచ్చయ్య (50) అక్కడికక్కడే మృతి చెందాడు మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో వైద్యం కోసం ఎస్ కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోటకు తరలించినట్లు పోలీసులు తెలిపారు

పలు చోరీ కేసుల్లో నలుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు క్రైమ్ ఎడిసిపి మోహనరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎంవిపి కాలనీ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 15న, మద్దిలపాలెం చైతన్యనగర్‌లో హేమలత అనే వృద్ధురాలి ఇంటికి అద్దెకు ఇళ్లుకావాలని వచ్చి ఆమె మెడలోని గొలుసు, చేతి గాజులు లాక్కెళ్లిన ఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి, ఈనెల 17న సాయంత్రం కెఆర్ఎం కాలనీలోని సిరిపురపు వెంకటరమణ అనే వ్యక్తిని నిందితునిగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. పోలీసుల విచారణలో చోరీసొత్తును నిందితుడు ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.2.8 లక్షలకు తాకట్టు పెట్టినట్లు గుర్తించి బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. మరో కేసులో ఈనెల 15న ఎంవిపి కాలనీ సెక్టార్ 8లో నివసిస్తున్న సేవన లలిత వృద్ధురాలు తన ఇంటి వరండాలో నిద్రిస్తుండగా రెండు తులాల గొలుసును చోరీ చేసిన ఘటనలో పిడుగు జగదీష్ అనే నిందితుడిని ఈనెల 17వ తేదీ సాయంత్రం అరెస్ట్ చేసి విచారించగా చోరి సొత్తును ఫెడరల్ బ్యాంకులో రూ.1.29 లక్షలకు తాకట్టు పెట్టినట్టు అంగీకరించాడన్నారు

ఈనెల 10న శివాజీపాలెంలో శోభారాణి అనే మహిళ తన ఇంటి ముందు వాకిలి శుభ్రం చేస్తుండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసులు దొంగిలించిన ఘటనలో విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన నామాల నాగరాజు, షేక్ ఇమ్రాన్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశామనానరు. వీరు ఎంవిపి, పీఎం పాలెం, హార్బర్ పోలీస్ స్టేషన్లపాటు విజయవాడ అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్లలో ఆరు కేసులలో నిందితులుగా ఉన్నట్లు గుర్తించామని, నిందితుల 8 తులాల బంగారం, రూ.30 వేల నగదు, సుజుకి యాక్సెస్ వాహనం రికవరీ చేశామన్నారు. నిందితులలో నామాల నాగరాజుపై ఇప్పటికే 35 కేసులు ఉన్నాయని , ఇమ్రాన్‌పై 16 నాన్ బయలబుల్ వారెంట్ల తో పాటు 25 పాత కేసులు కేసులు ఉన్నాయని గుర్తించామన్నారు. మీడియా సమావేశంలో ద్వారక సబ్ డివిజన్ సిఐ చక్రధరరావు, ఎఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అంతరరాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. . ఈ ఏడాది జనవరి 22న తమ ఇంటిముందు పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురైందని అల్లిపురం ప్రాంతానికి చెందిన ఆన్సర్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన రెండో పట్టణ పోలీసులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రైమ్ ఎస్ఐ ఎన్ సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టగా ఒడిశా కోరాపుట్‌కు చెందిన కిల్లో కార్తీక్, అతని స్నేహితుడు బాబుల సుపియా నిందితులుగా గుర్తించారు. నిందితులను విచారించగా, నగర పరిధిలోనే మరో ఎనిమిది మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్టు అంగీకరించారని పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.పది లక్షల విలువచేసే మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, నాలుగు యమహా ఆర్ 15లు, ఒక కెటిఎమ్ ఆర్‌సి 200, ఒక యమహా ఎఫ్‌జెడ్ వాహనంతో సహా తొమ్మిది వాహనాలను రికవరీ చేశామన్నారు.



రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి డోలా

కెజిహెచ్‌లో మరొక గైనకాలజీ వార్డు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కెజిహెచ్‌లో కొత్తగా మరొక గైనకాలజీ వార్డును ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. రూ.కోటితో క్యాజువాలిటీ అభివృద్ధి పనులు ఇప్పటికే చేపట్టినట్టు వెల్లడించారు. ఐసియు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం ఆయన కెజిహెచ్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాడు తాను విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించానని తెలిపారు. ఒపి దగ్గర మహిళలకు ఫీడింగ్ రూమ్, చిల్డ్రన్స్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో సిబ్బంది ఆప్యాయంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అన్ని విభాగాల్లో ఫైర్ సేఫ్టీ మెజర్స్ అందుబాటులో ఉండాలన్నారు. రోగుల నుంచి సిబ్బంది ఎవరైనా లంచం తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో శిశు మార్పిడిలు జరగడానికి వీల్లేదన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన అదనపు భవనాలు నిర్మిస్తామని, సిబ్బందిని నియమిస్తామని అన్నారు. మందుల కొరతపై ఒక విలేకరి ప్రశ్నించగా తనకు ఇప్పుడే ఈ విషయం తెలిసిందని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సమాధానమిచ్చారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను మంత్రి పరిశీలించారు. రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నేడు విశాఖలో దేవిశ్రీ ప్రసాద్ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ లైవ్ ఇండియా టూర్‌లో భాగంగా ఏటీసీటీ ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలోని పోర్టు స్టేడియం వేదికగా మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నామని ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఉదయం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన మొదటి సినిమా ఆనందం నుంచి మ్యూజిక్ షోలు చేయాలని అనుకుంటున్నానని, ఈ క్రమంలోనే దేశంలోని ప్రధాన పట్టణాల్లో రాక్ స్టార్ డిఎస్‌పి లైవ్ ఇండియా టూర్ పేరిట మ్యూజిక్ షోలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. విశాఖతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ ఏపీసీటీ సభ్యుడు శోభన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని అనుమతులూ తీసుకున్నామని, 9800 మందికి అధికారులు అనుమతి ఇచ్చారని తెలిపారు. .

స్కోడా కొడియాక్ బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ స్కోడా ఆటో ఇండియా తన నూతన వాహనమైన స్కోడా కొడియాక్ బుకింగ్స్‌ను విశాఖలో ప్రారంభించినట్టు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా తెలిపారు. సిరిపురంలోని ఒక ప్రయివేటు హోటల్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనాల డెలివరీలు మే 2 నుంచి ఉంటాయన్నారు. నూతన వాహనం 320 ఎన్ఎం టార్కును ఉత్పత్తి చేసే 2.0 టిఎస్ఐ ఇంజిన్‌తో పనిచేస్తుందని, సెవెన్ స్పీడ్ డ్యూయల్ క్లచ్ డి ఎస్‌జి ఆటోమేటిక్ ద్వారా రెండు యాక్సిల్‌లకు అనుసంధానం చేయబడిందని తెలిపారు. లీటర్‌కు 14.86 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుందని, 786 లీటర్ల సామర్థ్యం కలిగిన డీజిల్ ట్యాంకులు కలిగి ఉందని తెలిపారు. వాహనాల ప్రారంభ ధర రూ.46,89,000గా ఉందన్నారు.

పంచాయతీ భవనం శిథిలం

ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు

కొత్త భవనం మంజూరైన ప్రారంభంకాని పనులు - ఆకుమామిడికోటలో నిర్వహణ



శిథిలమైన పంచాయతీ కార్యాలయం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ కార్యాలయం దశాబ్ద కాలం నుండి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. పుల్లంగి గ్రామపంచాయతీ భవనం శిథిలమై ఏళ్లు గడుస్తున్నాయి. కొత్త భవనాన్ని నిర్మించాలని స్థానికులు అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న స్పందించలేదు. గత్యంతరం లేక సమీపంలోని ఆకు మామిడికోట గ్రామ సచివాలయంలో పుల్లంగి పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. నూతన భవనం నిర్మించాలని ఎన్నో సార్లు మొరపెట్టుకుంటూ ఎట్టకేలకు కొద్దికాలం కిందట నూతన భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. కాని నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఏమైనా పనులు ఉంటే ప్రజలంతా ఆకుమామిడితోట గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు రవాణా సౌకర్యాలు కూడా సరిగా లేవని, కాలినడకని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి : సర్పంచ్

పుల్లంగి పంచాయతీ కార్యాలయ భవనం పూర్తి శిథిలమైందని పంచాయతీ సర్పంచ్ వి.జార్జిబాబు తెలిపారు. కొత్త భవనం మంజూరు చేయాలని ఐటిడిఏ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరగడంతో ఈ మధ్యకాలంలో కొత్త మంజూరైనట్లు అధికారులు తెలియజేశారని చెప్పారు. కానీ నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. వెంటనే పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయాలని జార్జిబాబు కోరారు.

21న వైద్య ఆరోగ్య రంగంపై సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21న 'వైద్య ఆరోగ్య రంగాలు - ప్రభుత్వ కాలేజీల ప్రైవేటీకరణ ప్రభావాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్స్ ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజేశ్వరరావు, పూర్వ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.రామారావు, ఆంధ్ర మెడికల్ కాలేజీ పూర్వ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ వైఎల్.నర్సింగరావు, యువజన విభాగం కార్యదర్శి కె.సంతోష్ కుమార్, డాక్టర్ అన్వేష్ పాల్గొని సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ కీర్తిశేషులు ప్రజా వైద్యులు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులైన డాక్టర్ కె.హరి ప్రసాద్ స్మృత్యర్థం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో విశ్రాంత ఐఎఎస్ అధికారి, ఎపి పూర్వ హెల్త్ సెక్రటరీ డాక్టర్ పివి.రమేష్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సత్యవరప్రసాద్ పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. దీనికి ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి.రమణయ్య అధ్యక్షత వహిస్తారని తెలిపారు. డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా వుంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, కావున ప్రభుత్వమే వైద్య ఆరోగ్య రంగాన్ని నిర్వహించాలని అన్నారు. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని, రాష్ట్రంలో నిర్మాణంలో వున్న పది ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో నిర్వహిస్తామని చెప్పడం అంటే ఇది అంతిమంగా ప్రైవేటీకరణకు దారితీస్తుందని అన్నారు.

వైద్య విద్య ఖరీదై ఎక్కువ మంది విద్యార్థులకు అందని ద్రాక్ష అవుతుందని, మెడికల్ సీట్లను కొనుక్కుని డాక్టర్లు అయినవారు సామాజిక బాధ్యతకు తిలోదకాలిస్తారని తెలిపారు. వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండదన్నారు. డాక్టర్ వైఎల్.నర్సింగరావు మాట్లాడుతూ దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఐదు శాతం వైద్య ఆరోగ్య రంగం కోసం ఖర్చు పెట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిందని, కానీ ప్రభుత్వాలు ఆ రంగం మీద చాలా నామమాత్రంగానే ఖర్చుపెడుతున్నాయని అన్నారు. పేద ప్రజలు తమ ఆరోగ్యాలు బాగు చేసుకోవడానికి జేబుల్లోంచి ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి వచ్చి, వారు మరింత పేదరికంలోకి జారిపోతున్నారని చెప్పారు. కావున ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలన్నారు. 21న తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

టిడిపి సంస్థాగత ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి సంస్థాగత ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన జరిగింది. ఎన్నికలపై శ్రీభరత్ పలు సూచనలు చేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. ప్రతి వార్డులో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిగే విధంగా దోహదపడాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాహన ఆవిష్కరణ కార్యక్రమంలో క్రికెటర్ శ్రీకర్ భరత్, ఎంపీ శ్రీభరత్

అప్రిలియా టువోనో 457 ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అప్రిలియా సంస్థ తమ నూతన వాహనమైన అప్రిలియా టువోనో 457ను విశాఖ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా పెదవాల్తేరు జంక్షన్‌లోని ఓరా మోటార్స్ షోరూమ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత క్రికెట్ జట్టు సభ్యుడు కోన శ్రీకర్ భరత్, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ హాజరై నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అప్రిలియా సంస్థ వాహనాలు యువతకు బాగా నచ్చుతాయని, యువత ఈ వాహనాలు నడిపేటప్పుడు భద్రతా నియమాలు పాటించాలని, అతివేగాన్ని నియంత్రిస్తూ రైడ్లను ఆస్వాదించాలని అన్నారు. అనంతరం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు పిల్లి కృష్ణ కాంత్, అడుసుమల్లి జానకిరామ్ మాట్లాడుతూ ఈ నూతన వాహనాన్ని అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్టు తెలిపారు. స్పోర్ట్స్ బైకుల విభాగంలో ఇతర సంస్థల వాహనాలకు ధీటుగా దీని రూపొందించడం జరిగిందని, ఇది 457 సీసీ ఆధారిత ట్విన్ సిలిండర్ కలిగి, స్లిప్పర్ సిస్టంతో కూడిన మల్టిపుల్ వెట్ క్లచ్, 6 గేర్లు కలిగి ఉంటుందని, దీని ఇంధన ట్యాంక్ సామర్థ్యం 13 లీటర్లు కలిగి ఉందని, అల్యూమినియం ఫ్రేమ్, ప్రీ లోడ్ సర్దుబాటు చేయగల సస్పెన్షన్, 320 ఎమ్ఎమ్ ఫ్రంట్ డిస్క్ బ్రేకులు, ఐదు అంగుళాల టిఎఫ్‌టి డిస్‌ప్లే, బ్లూటూత్, నావిగేషన్ వంటి సౌకర్యాలు ఈ వాహనంలో అమర్చబడ్డాయని తెలిపారు. వాహనం రెడ్, గ్రే రంగులలో అందుబాటులో ఉందని, ప్రారంభ ధర రూ.3,96,149గా నిర్ణయించామని తెలిపారు. వాహనం కొనుగోలుదారులకు మూడు సంవత్సరాల వారంటీ, మొదటి సంవత్సరంలో మూడు ఉచిత సర్వీసులతో పాటు మరో రెండు సంవత్సరాలు అదనంగా ఉచిత సర్వీసులు అందిస్తామని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రెడ్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ చందు తిప్పల, పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ ఎం.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాదంతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతిరోజూ బాదం తినడం వల్ల కార్డియోమెటబాలిక్ ఆరోగ్యానికి అర్థవంతమైన ప్రయోజనాలను అందిస్తుందని, బరువు నిర్వహణకు ఇది తోడ్పాటు ఇస్తుందని డాక్టర్ రోహిణి పాటిల్, పోషకాహార నిపుణులు షీలా కృష్ణస్వామి తెలిపారు. స్థానిక హోటల్‌లో జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ 11 మంది శాస్త్రవేత్తలు, వైద్యులు బాదం, కార్డియోమెటబాలిక్ ఆరోగ్యంపై పరిశోధనలు చేయటంతో పాటుగా బాదం ప్రయోజనాలపై ఏకాభిప్రాయానికి వచ్చారన్నారు. ప్రతి రోజూ బాదం తినడం వల్ల గుండె ఆరోగ్యం, బరువు నిర్వహణ, గట్ మైక్రోబయోమ్‌కు మేలు జరుగుతుందని నిపుణులు కనుగొన్నారన్నారు. బాదం ఎక్కువగా తీసుకోవడం కొంతమందిలో కొద్దిపాటి బరువు తగ్గడానికి సహాయపడుతుందని కూడా ఈ పరిశోధన తేల్చిందన్నారు. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా మద్దతుతో నిర్వహించిన ఈ పరిశోధనలో కీలక అంశాలను కరెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ న్యూట్రిషన్‌లో ప్రచురించారన్నారు.

'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' విజయోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శుక్రవారం విడుదలైన నందమూరి కల్యాణ్ రామ్ చిత్రం అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి విజయోత్సవ కార్యక్రమం జగదాంబ థియేటర్‌లో విశాఖ సిటీ ఎన్‌టిఆర్, కల్యాణ్ రామ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు కల్యాణ్ రామ్ నటించిన చిత్రాలు అన్నింటినీ మించి ఈ చిత్రం ఉందన్నారు. కార్యక్రమంలో పి.నరసింహ చౌదరి, వేగి రాధాకృష్ణ, జగదాంబ ప్రొప్రైటర్ వేగి జగదీష్ కుమార్ పాల్గొన్నారు.